# రచయిత్రి

రచయిత్రికి ఒక మంచి ఆలోచన మనసులో మెదిలింది. ఆలోచన రావడమే తడవుగా అది రెమ్మలతో, కొమ్మలతో, మొగ్గలతో, పువ్వులతో, కాయలతో, పళ్ళతో క్షణం క్షణం పెరుగుతూ, అందమైన ఊహావృక్షంగా సాక్షాత్కరించింది.

వెంటనే దాన్ని చక్కని కథగా వ్రాయాలని, తనకొచ్చిన కొత్త – సరికొత్త ఆలోచన – ఎవరూ ఊహించని విధంగా కథగా వ్రాసేయాలని ఉబలాటపడిపోయిందా రచయిత్రి. కథను మనసులో ఊహించడం మొదలు పెట్టినప్పటి నుంచి అది ఇంతై, ఇంతింతై అందాలు సంతరించుకుంటోంది.

ఆమె వెంటనే చేతిలో వున్న బట్టలు గబగబా గుంజి ఆరేసేసింది. గుత్తి వంకాయ కారంపెట్టి కూర వండుదామనుకున్నది. వెంటనే అభిప్రాయం మార్చేసుకుని, వంకాయలు తరిగి పోపులో వేద్దామని కాయలు తరిగేసింది. భర్తకి సర్ది చెప్పుకుందాములే అని సాంబారుని ఒట్టి చారుకి దించేసింది.

ఆమె మనసులో అందమైన ఊహలు సుడులు తిరుగుతుంటే ఆమె బొంగరంలా తిరుగుతూ అన్ని పనులు చేసేస్తోంది. పురాణానికని వెళ్ళిన అత్తగారు వస్తే బాగుండును. ఆమెకి కాస్త పని వప్పగించవచ్చు అనుకుంది మనసులో. ఇలాంటి విషయాల్లో అత్తగారు ఎంతో ప్రోత్సాహం ఇస్తారు అని ఆమెకి బాగా తెలుసు.

ఇకపోతే ఆడపడుచు నెలలు నిండి పురిటికని వచ్చింది. ఆమెకి పని చెప్పడం భావ్యం కాదు. కాబట్టి ఈ భావలహరిని కాసేపు ఆపి తను పని వీలయినంత త్వరగా

తెముల్చుకుని కాగితం, కలం తీసుకోవాలని తహ తహలాడుతోంది. మెషీన్లా పనిచేయడం వల్ల ఆమె పని త్వరలోనే ముగిసింది. సమయం రాత్రి ఏడున్నర కావచ్చింది.

అప్పుడే ఇంట్లో అడుగు పెట్టిన భర్తకి వెచ్చగా కాఫీ ఇచ్చి ముందే అతనికి ఆ రోజు వంట చాలా సింపుల్‌గా వండినట్టు, దానికి కారణం తను కథ వ్రాయబోతున్నట్టు చెప్పింది. రచయిత్రి కథ వ్రాయాలంటే ఆమె భర్త ప్రసన్నంగా వుండడం ఎంతో అవసరం. ఎందుకంటే ఎంతటి మహత్తరమైన ఆలోచనైనా దాన్ని భర్త చిరాకు క్షణంలో హరించేస్తుంది. అందుకని ఆమె ముందు చూపుతో జాగ్రత్త పడింది. అతను వెంటనే "ఏం ఫరవాలేదు. చారు కూడా లేకపోయినా మజ్జిగ వుంటే చాలు" అన్నాడు.

ఆమె మరింత ఆనందంతో ఉత్సాహంగా "స్నానం చెయ్యండి. వడ్డించేస్తా" అంది.

ఓపలేని ఆడపడుచు, అత్తగారు, భర్త, అయిదేళ్ళ ఆకతాయి కొడుకు కూర్చుండగా ఆమె వడ్డన చేసింది. భోజనాలు పూర్తయినాయి. రచయిత్రి గుండెలు ఆవేశంగా అదురుతున్నాయి. ఆకలిగా అనిపించలేదు. పైగా అన్నం కడుపులో పడితే నిద్ర ముంచుకొస్తుంది. వెంటనే వెళ్ళి గదిలో కాగితాలు – పెన్ను తీసుకుందామా అనిపిస్తోంది.

ఇంక వుండబట్టలేక అత్తగారితో మెల్లిగా అంది. "ఒక కథ వ్రాయాలనుకుంటున్నాను" అని.

"అయితే నువ్వెళ్ళు. ఈ కంచాలూ అవీ నే తీసేసి, యిల్లు కడిగేస్తా" అందామె ఆప్యాయంగా.

"పాలు యింకా కాచలేదు"

"నే కాచి తోడు వేస్తాలే – నువ్వెళ్ళు."

"అదేమిటి వదినా, ఇందాకే నాకు చెప్పకపోయావా? నేను చేద్దును కదా వంట" అంది ఆడపడుచు అభిమానంతో.

నిండు నెలలతో వున్న మనిషి అలా అనడంతో రచయిత్రికి క్షణకాలం సిగ్గేసింది. కాని తన అదృష్టానికి గర్వపడి.

"చాల్లే, ఇంక నీ చేత కూడా చేయించుకోవాలి" అంటూ ప్రేమగా ఆమె తల నిమిరింది.

అత్తగారిచ్చిన భరోసాతో వంటిల్లు వదలి తన గదిలోకొచ్చి తెల్ల కాగితాలు తీసుకుంది. పెన్ను ఎక్కడ వెదికినా కనిపించలేదు. వెదుకుతుంటే విసుగ్గా అనిపించింది. అక్కడే వున్న భర్తని పెన్ను ఇమ్మని అడిగింది. అతను పేంటు జేబులో వుంది తీసుకోమన్నాడు. ఒక్క అంగలో వెళ్ళి పెన్ను అందుకుంది. తీరా చూస్తే అది వ్రాయడం లేదు.

"ఏమండీ ఇది వ్రాయడం లేదు" అంది మరింత కంగారుగా.

"ఇంకు లేదేమో, పోసుకో" అన్నాడతను. రచయిత్రికి విసుగనిపించినా ఓపికగా ఇంకు పోసుకుని, అట్ట ఒత్తుపెట్టుకుని కుర్చీలో కూర్చుంది –

ఇంక కథ మొదలు పెట్టాలి, అలా ఇలా కాదు. చాలా కొత్తగా చాలా అందంగా మొదలు పెట్టాలి. ఆమె చెంపకి చెయి ఆన్చి రెండు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించింది. రెండు మూడు రకాలుగా కథ మొదలు పెట్టాలనిపిస్తోంది. ఏదో ఒకటి నిర్ణయించుకుని వ్రాయడం మొదలుపెట్టాలి.

ఆమె గడియారం కేసి చూసింది.

అది తొమ్మిదిన్నర చూపిస్తోంది. ఆలోచన తెగడంలేదు. మొదటి వాక్యం పేపరు మీద పడడం లేదు.

ఇంతలో తలుపు కిర్రుమంది. ఆమె అటు తిరిగి చూసింది. అత్తగారు అనుమానంగా తటపటాయిస్తూ తననే పిలవడం చూసి చటుక్కున కాగితాలు – పెన్ను పక్కనపెట్టి "ఏమిటండీ అత్తయ్యా" అంటూ లేచింది.

"అమ్మాయికి అనుమానంగా వుంది. నొప్పులొస్తున్నట్టున్నాయి" అందామె నెమ్మదిగా.

రచయిత్రి మనసులో ఆలోచనలు తుపాకీ గుండుకి చెల్లాచెదురైన చెట్టుమీద పిట్టల్లా తలో దిక్కుకీ ఎగిరిపోయాయి. బుర్ర శూన్యంగా అయిపోయింది. క్షణంలో స్పృహలోకి వచ్చి–

"హాస్పిటల్‌కి తీసుకెళ్దామా" అంది.

"అదే అనుకుంటున్నాను. నాకు కాళ్ళు చేతులు ఆడడం లేదు" అందామె భయంగా.

"మరేం ఫరవాలేదు. మీరు అధైర్య పడకండి, ఆమెకి ఈజీగా పురుడొచ్చి చక్కని బాబు పుడతాడు" అంది అత్తగారికి ధైర్యం చెప్తూ.

"నువ్వు బుట్టలో కాసిని బట్టలు అవీ సర్దు" అంటూ ఆమె కొడుకు దగ్గరకు వెళ్ళింది. క్షణంలో అతను బట్ట లేసుకుని రిక్షాకోసం వెళ్ళిపోయాడు. ఆమె ఫ్లాస్కులో వేడినీళ్ళు - బట్టలు అన్నీ బుట్టలో పెట్టి గుమ్మంలో నిలబడింది - రిక్షా వచ్చింది.

ఆడబిడ్డ అడుగులో అడుగు వేసుకుంటూ తల్లి సహాయంతో రిక్షా ఎక్కింది. ఆమెతోపాటు రచయిత్రి రిక్షా ఎక్కింది. అత్తగారు, భర్త, వెనుక వస్తున్నారు.

"వదినా, భయంగా వుంది" అంటే -

"ఛా, భయం దేనికి? నీకేం ఫర్వాలేదు" అంటూ ఆమెకి ఉత్సాహవంతమైన కబుర్లు చెప్పింది.

❖ ❖ ❖

ఆ రోజు కాదుకదా, పదిహేను రోజుల వరకు రచయిత్రి ఆడపడుచుకు పురుడు రాలేదు బలహీనంగా వుందని డాక్టరు ఆమెను హాస్పిటల్‌లోనే వుంచమంది. ఇంట్లో పని - ఇంటికీ - హాస్పిటల్‌కి అన్నం, కాఫీ తీసుకెళ్ళడం, అత్తగారు వస్తే తను వెళ్ళడం - తను వస్తే అత్తగారు వెళ్ళడం - ఈ మధ్యలో భర్తని అది కావాలి, ఇది కావాలి అంటూ బజారుకు తరమడం - ఇదే దినచర్య అయింది రచయిత్రికి, గంటలు, రోజులు, వారాలు గిరగిరా తిరిగిపోయాయి.

రచయిత్రి మనసులోని అందమైన కథ వాడి వొడలిపోయింది. రేకలు రాలిన తొడిమలా, కల్పన చెరిగి 'థీమ్' మిగిలిపోయింది.

అక్కడికీ కాస్త సమయం చిక్కగానే మళ్ళీ అంత ఊహనీ కథగా మలుచుకోవచ్చని ఆ కథా వస్తువుని మనసులో పదిల పరిచిందామె.

ఆడబడుచు పురుడు-బాలసారె-శాంతి వగైరాలు పూర్తయే నాటికి రెండు నెలలు దాటిపోయాయి.

ఆ రోజు ఉదయం రేడియో పెట్టి క్షణం అక్కడే నిలబడింది. సాహిత్య స్రవంతి కార్యక్రమం. ..... రచయిత కథ వింటారు అని చెప్పగానే రచయిత్రి శ్రద్ధగా రేడియో పక్కనే కూర్చుంది.

అదే-అదేకథ- అదే కథా వస్తువు. అదే ఆలోచన. చిన్న చిన్న తేడాలతో అదే కథ. తన ఊహలోంచి వెలువడని కథ- మరో రూపంలో రచయిత్రికి ఆశ్చర్యం - అంతలోనే నిరాశ-అంతలోనే ఆవేదన-ఇదెలా సాధ్యం?

ఆమె కొచ్చిన ఆలోచన మరొకరికి రాకూడదనేముంది? ఆమె ప్రశ్నలోంచే ఆమెకి జవాబు.

కథ చాలా బాగుంది. ఎంతో బాగుంది. సమర్థురాలైన రచయిత సమర్థంగా వ్రాసిన చక్కని కథ - రచయిత్రి ఈ మాట ఎన్నోసార్లు అనుకుంది.

పెసరట్లు చెయ్యాలంటే పెసలు బాగా నానాలి - బట్ట బాగా మురికి పోయి తెల్లగా రావాలంటే సబ్బుతో నానాలి. కాని కథ వ్రాయాలంటే మాత్రం ఎక్కువ రోజులు నాన్చకూడదు అని అనుభవంతో తెలుసుకుంది రచయిత్రి.

●